IJMRT: Volume (2), Issue 5, 2020

ISSN (Print):2663-2381
ISSN(Online):2663-4007

International Journal of Multidisciplinary Research Transactions

(A Peer Reviewed Journal)
www.ijmrt.in

# Annamayya-Bhakti Sopaanaalu
# అన్నమయ్య – భక్తిసోపానాలు

**Dr.Mrudula Nandavaram***
Assistant Professor
Government Degree College
Narsapur, Medak District, India

**డా. నందవరం మృదుల**
అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగు శాఖాధ్యక్షులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
నర్సాపూర్ -మెదక్ జిల్లా

---

'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః' – భాషతో ప్రమేయం లేకుండా సంగీతం అందరినీ అలరిస్తుంది. సృష్టిలోని సర్వప్రాణులను రంజింపచేస్తుంది. తాళలయబద్ధమైన గేయంలో అద్భుతమైన భావాన్ని చొప్పించినప్పుడు మానవ హృదయంలో అది ముద్రితమై మనసును తనవైపుకు ఆకర్షించుకుంటుంది. ఈ కోవకు చెందినదే తెలుగువారి తొలి వాగ్గేయకారుడు – అన్నమాచార్యులవారి సాహిత్యం.

కలియుగ వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుని అవతారమైన శ్రీవేంకటేశ్వరుడు భక్తులపాలిట కొంగుబంగారం. కల్పవృక్షం. ఆ కొంగుబంగారాన్ని, ఆ కల్పవృక్షాన్ని 32 వేల కీర్తనలతో అలరించిన అన్నమయ్య తెలుగువారికి దొరికిన గొప్ప నిధి. ఆయన రచించిన శృంగార సంకీర్తనలలోను, ఆధ్యాత్మ సంకీర్తనలలోను, శ్రీనివాసుని పాళ్ళే ఎక్కువ. విఠలా!చెన్నకేశవా! నారసింహా! ఇలా ఏ మూర్తిని కీర్తించినా శ్రీనివాసుని పరంగా కీర్తించినవారు అన్నమయ్య. అన్నిమూర్తులలోనూ ఆ శ్రీనివాసునే దర్శించి, మనలను తరింపజేస్తారు.

తాళ్ళపాక అన్నమాచార్యులవారి కాలం 1408-1503. "తాళ్ళపాక సాహితీమందిరానికి మతము పునాది. సంస్కృతాంధ్రములు కట్టడపు శిలలు. సంకీర్తనాది సాహితీప్రక్రియలు సోపానములు. అందలి ఆరాధ్యదైవము శ్రీ వేంకటేశ్వరస్వామి. ధర్మార్థ కామమోక్షములు నాలుగు ప్రాకారములు. మధుర కవితలు ద్వారా వాకిళ్ళు సార్వజనీనము, సార్వకాలికము అగు ఉత్తమ భావ సంపద తన్మందిర శ్రీభాండారము. ఆ కవులే అర్చకులు. భక్తియే భగవత్ప్రసాదము. గానమే స్వామి అంగరంగభోగములు. రసికవర్యులే యాత్రికులు. అదియే కవితాస్వరూపము" అంటారు రాళ్ళపల్లి (అన్నమయ్య పదవైభవం. పుట. 107)

అన్నమయ్య శృంగార సంకీర్తనలు క్షేత్రయ్య లాంటి పదకర్తల అధ్యాత్మ సంకీర్తనలు భద్రాచల రామదాసులాంటి భక్తకవులకు మార్గదర్శకమయ్యాయి. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో భక్తి, శృంగార సంకీర్తనల్లో మధురభక్తి స్పష్టమవుతుంది. నవ విధ భక్తితత్త్వాన్ని అన్నమయ్య తన కీర్తనల్లో పదాల్లో ప్రతిపాదిస్తారు. సర్వం విష్ణుమయంగా భావించి ఆత్మ పరమాత్మ కలయికను వర్ణించడానికి తానే నాయికగా మారి భగవంతునికి తనను తాను అర్పించుకుని తరించారు. భక్తిలో, రక్తిలో, వైరాగ్యంలో, ఆధ్యాత్మచింతనలో, నీతిప్రబోధంలో తనను తాను ఆ శ్రీ వేంకటేశ్వరునిలో లీనం చేసుకున్నారు.

1. **భక్తి కీర్తనలు:** అన్నమాచార్యులు రాసిన అన్ని కీర్తనలు శ్రీ వేంకటేశ్వరునికే



Copyrights@IJMRT 

అంకితాలు. ఈ వాగ్గేయ సాహిత్యంలో కనిపించే విష్ణుభక్తి వైష్ణవమతము – విశిష్టాద్వైతము. విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించింది భగవద్రామానుజులు. అందువల్లే ఈ మతానికి రామానుజ మతమనే పేరు వచ్చింది. ఈ మతంలో శ్రీమన్నారాయణుడే పరమదైవం. అందుకు ఏకైక మార్గం – భక్తి. నారదుడు, శాండిల్యుడు, వ్యాసభగవానుడు ఈ భక్తిని పలువిధాలుగా వివరించారు.

నారదుడు 'భక్తిరేవగరీయసీ', 'భగవద్వియోగ దుస్సహత్వం, సర్వాత్మ సమర్పణబుద్ధి' అనే ఈ రెండు లక్షణాలను కలిగి ఉండడమే భక్తి అని తెలిపి, భగవద్గుణ శ్రవణ కీర్తనలను సాధనాలని వివరించారు. (అన్నమయ్య పద వైభవం. పుట. 108)

**భాగవతంలో -**

'శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం

అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం' అని నారదుడు భక్తిమార్గాలను వివరిస్తాడు. వీటిని స్మరిస్తూ, ప్రాధాన్యాన్ని వివరిస్తూ అన్నమయ్య తన కీర్తనలను మనకు వినిపించారు. భక్తి కీర్తనలేకాక, వైరాగ్య కీర్తన, శృంగార కీర్తన చెప్పినా వర్ణన భక్తి భావనతోనే ముగుస్తుంది. శృంగార కీర్తనలన్నీ మధురభక్తి భావనలే కదా! (అన్నమయ్య పద వైభవం. పుట.86)

**నవవిధ భక్తులలో మొదటిది -**

**1.1. శ్రవణం:** భగవంతుని గుణగణాలను వినడం – భక్తికి తొలిమెట్టు. ఈ మార్గంలో పరమపదం పొందినవాడు పరీక్షిణ్మహారాజు. గర్భంలో ఉండి భక్తిమార్గాన్ని అనుసరించినవాడు ప్రహ్లాదుడు – పూర్వం నైమిషారణ్యంలో శౌనకాది మహామునులు సూతమహర్షి ద్వారా విన్నది కూడా భక్తి పొందినది భక్తి. అన్నమయ్య మన కోసం -

వినరో భాగ్యము విష్ణుకథా

వినుబలమిదివో విష్ణుకథా

ఆది నుండి సంధ్యాది విధులలో

వేదంబైనది విష్ణుకథా

నాదించీనిదే నారదాదులచే

వీధి వీధులనే విష్ణు కథా (అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 264)

- అంటారు. విన్నచాలు, మన మనసు ఆ వేంకటేశ్వరునిపై లగ్నమైపోతుంది. ఇదే శ్రవణభక్తి.

**1.2. కీర్తనం:** భగవంతుని నామం, రూపం, లీలలను కీర్తించడం కీర్తన భక్తి. అన్నమయ్య కీర్తనలన్నీ ఉదాహరణీయాలే.

చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు

చాలదా హితవైన చవులెల్ల నొసగ.....

హరినామమే కడు ఆనందకరము

మరుగవో మరుగవో మరుగవో మనసా

(అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 118)

అని హరినామాన్ని కీర్తించినా చాలు మనం ఆయన సన్నిధికి చేరుకుంటామని చెబుతారు అన్నమయ్య – ఇదే కీర్తన భక్తి.

**1.3. స్మరణం:** నిరంతరం భగవంతుని నామాన్ని, రూపాన్ని, గుణగణాలను స్మరించడం, మననం చేసుకోవడమే స్మరణభక్తి.

భావములోనా బాహ్యము నందును

గోవింద గోవింద యని కొలువవో మనసా – అన్నా (అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 220)

భావయామి గోపాలబాలం – అన్నా అది స్మరణ భక్తియే. (అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 221)

**1.4. పాదసేవనం :** దేవతామూర్తుల పాదాలను ఆశ్రయించడమే పాదసేవనం.

బ్రహ్మకడిగిన పాదము

బ్రహ్మము తానె నీ పాదము (అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 216)

ఆ భగవంతుని పాదాలను ఆశ్రయించినా, మన దృష్టిని, మన మనసును ఆ వైపు లగ్నం చేసినా చాలు. ఆ దేవదేవుడు మనల్ని తనలో స్వీకరిస్తాడు.

**1.5. అర్చనం:** దేవతామూర్తులకు జల, పుష్ప, సుగంధాదులతో సేవించడమే అర్చనాభక్తి.

షోడశకళానిధికి షోడశోపచారములు

జాడ తోడ నిచ్చలును సమర్పయామి (అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 278)

అని శక్తి కలిగినవారు షోడశోపచారములతో స్వామిని సేవించవచ్చు. యథాశక్తి చేసిన పూజలు స్వామి స్వీకరిస్తాడు కాబట్టి అర్చన కూడా ఒక భక్తిమార్గం.

**1.6. వందనం:** కేవలం నమస్కారం తెలపడం కూడా ఒక భక్తి మార్గమే. వాచిక, మానసిక సంబంధం లేకుండా కేవలం రెండు చేతులు జోడించి నమస్కరించినా అది కూడా భక్తి.

నారాయణతే నమో నమో

భవ నారద సన్నుత నమో నమో (అన్నమయ్య పదామృతవర్షిణి. పుట. 170)

........................

అదివో చూడరో అందరు మొక్కరో

గుడికొనె బ్రహ్మము కొనేటి దరిని

అని వందన మార్గం చూపిస్తారు అన్నమయ్య (అన్నమయ్య సంకీర్తనాసారభవం. పుట. 5)

**1.7. దాస్యం:** మనోవాక్కాయ కర్మలతో హరికి దాసుడవ్వడమే దాస్యభక్తి. దీనినే కైంకర్యం, సేవ అని కూడా అంటారు. అర్చామూర్తి ఆరాధనకు కావలసిన ఏర్పాట్లు చేయడం – దాస్యం.

ఇందువల్ల ఏమి కద్దు ఇనుపగుగ్గిళ్ళింతే

ఇందిరా రమణుసేవే ఇరవైన పదవి

............

ఏ పురాణమున ఎంత వెదకినా

శ్రీపతిదాసులు చెడరెన్నడును (అన్నమయ్య సంకీర్తనాసుధ. పుట. 13)

అని మానవుడు చెడిపోకుండా ఉండడానికి మార్గం చెబుతారు. భగవంతునికి సేవ చేసీ, చేసీ భగవంతునిలో లీనమయ్యే సమయమది.

**1.8. సఖ్యభక్తి:** స్నేహభావంతో ప్రేమభావంతో భగవంతుని సేవించడం సఖ్య భక్తి.

అలమేలు మంగను నేనైతి నైతిగాక

నిలుచుండి నను జూచి నీకేల లోగను (అన్నమయ్య పద వైభవం. పుట. 88)

అని అన్నమయ్య తనను తాను అలమేలు మంగగా మలచుకొని స్వామిని సఖ్యభక్తితో కొలిచారు.

**1.9. ఆత్మనివేదన:** భగవంతుని శరణాగతి వేడుతూ తనను తాను అర్పించుకోవడమే ఆత్మనివేదనం.

శరణు శరణు సురేంద్ర సన్నుత

శరణు శ్రీసతి వల్లభా

శరణు రాక్షస గర్వ సంహార

శరణు వేంకటనాయకా – అని శరణు కోరారు. (అన్నమయ్య పదామృతవర్షిణి.

పుట.275)

సర్వధర్మాలను పరిత్యజించి తనను మాత్రమే ఆశ్రయించమని చెప్పిన శ్రీకృష్ణుని బోధలకు కీర్తన రూపమిది. ప్రపత్తి మార్గాన్ని అనుసరించి ఆత్మనివేదనం చేసారు అన్నమయ్య.

ఇహమే కాని యిక బరమే కాని

బహుళమై హరి నీపై భక్తే చాలు

యెందు జనించిన నేమి

యెచ్చోటనున్న నేమి

కందువ నీ దాస్యము కలిగితే చాలు

అంది స్వర్గమే గాని అల నరకమేగాని

అందపు నీ నామము నాకబ్బుటే చాలు (అన్నమయ్య పదవైభవం. పుట. 89)

అని అన్నమయ్య తాను ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా భగవంతుని యందు భక్తి కలిగి ఉండడమే తనకు భాగ్యము అని భావించారు.

నెట్టన శ్రీపతి మగనికి శరణు

దిట్టయై సర్వేశుడైన దేవునికి శరణు

చెలగి జగత్తులకు జీవులకు బ్రాణమై

నెలవై యుండే యతనికి శరణు

తెలివై మఱపై దేహాలలో సూత్రమై

వలనై రక్షించే యట్టివాని శరణు (అన్నమయ్య పదవైభవం. పుట. 71)

అని శరణాగతభావాన్ని ప్రకటిస్తారు అన్నమయ్య. ఏ మార్గమైనా ప్రయాణం సిన ఆ దేవుని సన్నిధికే చేరుతామని, వారి వారి శక్త్యానుసారణం భగవంతుని కొలవవచ్చని, అందరికీ సులభసాధ్యుడు తన కీర్తనలలో అన్నమయ్య ప్రకటిస్తారు.

ఈ తొమ్మిదింటిలో ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఆ దేవుని సన్నిధికి చేరుతామని; వారి వారి శక్త్యానుసారం భగవంతుని కొలవవచ్చని; భగవంతుడు అందరికీ సులభసాధ్యుడు అని; భక్తిమార్గంలో నిలిచినవారు ఇటు సమాజానికి అటు భగవంతునికి చేరువవుతారని అన్నమయ్య కీర్తనలు తెలుపుతాయి.

**ఉపయుక్త గ్రంథసూచి:**


1. ఆర్వియార్. ఆంధ్ర సాహిత్య చరిత్ర - సంస్కృతి (సాహిత్య వ్యాసాలు) 2006. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. విజ్ఞాన్ భవన్. హైదరాబాద్.
2. కాత్యాయనీ విద్మహే. ప్రాచీన సాహిత్యం - మరోచూపు. 2008. జిజ్ఞాస ప్రచురణలు. వరంగల్.
3. రవికృష్ణ, మోదుగుల. (సంపా). వనమాల. శ్రీకృష్ణ దేవరాయ పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవ సంచిక. 2010. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్.
4. లలిత రామ్. చైతన్యప్రభ (వ్యాసావళి). వంశీ స్వర్ణోత్సవ ప్రచురణ-33. ప్రపంచ తెలుగు సమితి. అమెరికా.
5. వెంకట్, గరికపాటి. అన్నమయ్య తత్వగీత. 2020. నవోదయ బుక్ హౌస్- హైదరాబాద్.
6. శాంతాభాస్కర్.టి. అన్నమయ్య సంకీర్తనాసుధ. 2020. లోకేష్ ప్రచురణలు- చిత్తూరు.
7. శాంతాభాస్కర్, టి. అన్నమయ్య సంకీర్తనాసౌరభం. (భావార్థ సహితము). 2020. లోకేష్ ప్రచురణలు. చిత్తూరు.
8. శ్రీరంగస్వామి, టి. అన్నమయ్య పదవైభవం. (వ్యాస సంకలనం). 2010.శ్రీలేఖ సాహితీ పబ్లికేషన్స్ - వరంగల్.
9. శ్రీలక్ష్మీ గణపతిశాస్త్రి. (సంకలనం) సంకీర్తనారత్నాకరం. 2015. శ్రీబాలాజీ పబ్లికేషన్స్. విజయవాడ.
10. సీతారామ శర్మ మహీధర. (సంకలనం) అన్నమయ్య పదామృత వర్షిణి. 2009. సుజనరంజని ప్రచురణ- హైదరాబాద్
11. సుబ్రహ్మణ్యదీక్షితులు, అమరవాది. భావయామి వేంకటేశమ్ - సంపుటి-V.2011. హైదరాబాద్.
12. సుబ్రహ్మణ్యం, భాగవతుల. అన్నమాచార్యుల కీర్తనలు (సంకలనం). 2002. భరణి పబ్లికేషన్స్. విజయవాడ-2.